జాతీయ వార్తను ఈ-పేపర్‌లోనూ,
డబ్ల్యుడబ్ల్యూడబ్ల్యూ.జాతీయవార్త.కామ్‌లో
కూడా వీక్షించవచ్చు.

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com

# జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక

చదవండి.. చదివించండి..

జాతీయ వార్త తెలుగు దినపత్రిక

మా పత్రిక అభివృద్ధికి పాఠకులు, శ్రేయోభిలాషులు, మిత్రులు, అధికారులు సహకరించాలని మనవి. మీమీ మండలాల్లో ఏమైనా సమస్యలు ఉన్నాయా.. ఎవరైనా ఇబ్బందులు పెడుతున్నారా.. అయితే వాటిని మా దృష్టికి తీసుకురండి.. వాటిని జాతీయ వార్త తెలుగు దిన పత్రికలో ప్రచురిస్తాం. మీ సమస్యలను రాజకీయ నాయకులు, అధికారుల దృష్టికి తీసుకువెళతాం - ఎడిటర్, ఫోన్: 9963063761

epaper:jatheeyavaartha.com
www.jatheeyavaartha.com



### 23న ఎచ్చెర్లలో
## మెగా జాబ్‌మేళా
**✻ జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్**



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 21 (వార్త):** నిరుద్యోగ యువతీ యువకుల కోసం ఈనెల 23న మెగా జాబ్ మేళాను నిర్వహిస్తున్నామని జిల్లా నైపుణ్యాభివృద్ధి అధికారి ఉరిటి సాయికుమార్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర నైపుణ్యాభివృద్ధి సంస్థ ఆధ్వర్యంలో ఎచ్చెర్లలోని ప్రభుత్వ పాలిటెక్నిక్ కళాశాల ప్రాంగణంలో ఉదయం 9 గంటలకు ఈ జాబ్‌మేళా ప్రారంభమవుతుందన్నారు. ఈ మేళాలో టాటా ఎలక్ట్రానిక్స్, మిరాకిల్ సాఫ్ట్వేర్ సొల్యూషన్స్, టెక్ మహీంద్రా, వోల్టాస్ లిమిటెడ్, డెక్కన్ ఫైన్ కెమికల్స్, ఎన్.ఎస్. ఇన్స్ట్రుమెంట్స్, డైకిన్ తో కలిపి సుమారు 13 ప్రైవేట్ కంపెనీలు పాల్గొని సుమారు 400 ఖాళీలకు నియామకాలు చేపట్టనున్నట్లు తెలిపారు. ఎస్ఎస్‌సీ, ఇంటర్మీడియట్, ఐటీఐ, డిప్లొమా, డిగ్రీ, చదివిన 18 నుండి 30 ఏళ్ల మధ్య వయసున్న నిరుద్యోగ యువతి యువకులు అర్హులన్నారు. ఇంటర్వ్యూలో సెలెక్ట్ అయిన వారికి శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, తుని, శ్రీ సిటీ నెల్లూరు, హైదరాబాద్, చెన్నైలో ఉద్యోగ అవకాశాలు కల్పిస్తారన్నారు. అభ్యర్థులు తప్పనిసరిగా naipunyam.ap.gov.in వెబ్‌సైట్‌లో రిజిస్ట్రేషన్ చేసుకొని, రిఫరెన్స్ నంబర్, రెజ్యూమే, ఆధార్, విద్యార్హతల ఒరిజినల్స్, జెరాక్స్ కాపీలు, పాస్‌పోర్ట్ సైజు ఫోటోతో కలిసి ఉదయం 9 గంటలకు జాబ్ మేళా ప్రాంగణానికి రావాలని తెలిపారు. మరిన్ని వివరాలకు 9550967353 నెంబర్ను సంప్రదించవచ్చని చెప్పారు.

### మత్స్యకార కుటుంబాలకు పెండింగ్
## ఎక్స్‌గ్రేషియా విడుదల
**✻ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు**



**శ్రీకాకుళం, ఫిబ్రవరి 21(వార్త):** ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం మత్స్యశాఖ ఆధ్వర్యంలో గ్రూప్ యాక్సిడెంట్ ఇన్సూరెన్స్ స్కీమ్ కింద మరణించిన 95 మంది మత్స్యకారుల కుటుంబాలకు ఎక్స్‌గ్రేషియా సహాయం విడుదల చేసినట్లు వ్యవసాయ, మత్స్య శాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. 2018 సంవత్సరం నుండి వివిధ దశలలో పెండింగ్‌లో ఉన్న ఈ కేసులను ప్రత్యేకంగా పరిశీలించి, మొత్తం రూ. 4.75 కోట్లు మంజూరు చేసి విడుదల చేయడం జరిగిందన్నారు. ఈ పెండింగ్ ఫైళ్లను వేగవంతంగా పరిష్కరించి, 95 మంది లబ్ధిదారులలో 90 మంది కుటుంబాల బ్యాంకు ఖాతాల్లో ఎక్స్‌గ్రేషియా మొత్తాలు జమ చేయబడినట్లు వెల్లడించారు. మిగిలిన 5 మంది లబ్ధిదారుల ఖాతా వివరాల్లో ఉన్న సాంకేతిక సమస్యల కారణంగా జమ ప్రక్రియ పూర్తికాలేదని, వాటిని త్వరితగతిన పరిష్కరించి మొత్తాలను వారి ఖాతాల్లో జమ చేయనున్నట్లు మంత్రి తెలిపారు. మరణించిన మత్స్యకారుల కుటుంబాలకు ఆర్థిక భరోసా కల్పించడం ప్రభుత్వ బాధ్యతగా భావిస్తున్నామని, బాధిత కుటుంబాలు ఎటువంటి ఇబ్బందులు లేకుండా సహాయం అందేలా కూటమి ప్రభుత్వం కట్టుబడి ఉందని మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు స్పష్టం చేశారు.

జిల్లాలో వేర్వేరు చోట్ల
## అగ్నిప్రమాదాలు
లోపల పేజీల్లో






జాతీయ
# వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం



## అలరించిన వీధి నాటకాలు


### -మెట్టపేటలో శ్రీరాజమ్మ తల్లి సంబరాలు ఘనంగా ప్రారంభం

**జలుమూరు, ఫిబ్రవరి 21(వార్త):** మెట్టపేటలో కొలువై ఉన్న శ్రీ రాజమ్మ తల్లి సంబరాలు శనివారం భక్తి శ్రద్ధలతో ప్రారంభమయ్యాయి. రెండు రోజుల పాటు జరిగే ఈ ఉత్సవాలకు జలుమూరు, సరుబుజ్జిలి, ఎల్.ఎన్.పేట తదితర మండలాలకు చెందిన పలు గ్రామాల నుంచి భక్తులు భారీగా తరలివచ్చారు.

భక్తులకు ఎలాంటి అసౌకర్యం కలగకుండా కమిటీ సభ్యులు తగిన ఏర్పాట్లు చేశారు. వివిధ గ్రామాల నుంచి వచ్చిన భక్తులు అరటి గెలలు సమర్పించి తమ మొక్కులు తీర్చుకున్నారు. ఆలయ ప్రాంగణం భక్తుల రద్దీతో కళకళలాడింది. సాయంత్రం నిర్వహించిన వీధి నాటకాలు ప్రేక్షకులను అలరించాయి. భక్తి, సాంప్రదాయ అంశాలతో కూడిన ప్రదర్శనలు సందడి చేశాయి. గ్రామీణ కళాకారుల ప్రతిభను భక్తులు ప్రశంసించారు.



## బోధనా పద్ధతులపై శిక్షణ



**నరసన్నపేట, ఫిబ్రవరి 21(వార్త):** విద్యాశాఖ ఆదేశాల మేరకు క్లస్టర్ పరిధిలో నిర్వహిస్తున్న ఆన్‌లైన్ సమావేశాల్లో సత్యవరం జిల్లా పరిషత్ పాఠశాల ఉపాధ్యాయులు పాల్గొన్నారు. శనివారం నిర్వహించిన ఈ సమావేశంలో ఉన్నతాధికారులు ఉపాధ్యాయులకు బోధనలో అనుసరించాల్సిన పద్ధతులపై మార్గదర్శనం చేశారు. విద్యార్థులకు పాఠ్యాంశాలను సమర్థవంతంగా బోధించే విధానాలు, ప్రతి తరగతికి అనుగుణంగా అనుసరించాల్సిన బోధన వ్యూహాలు, అభ్యాస ఫలితాల మెరుగుదలపై పలు సూచనలు అందజేశారు. విద్యార్థుల సామర్థ్యాన్ని పెంపొందించేలా బోధనలో నూతన విధానాలను అమలు చేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో హెచ్‌ఎం రత్నమాల పాల్గొన్నారు. ఉపాధ్యాయులు సమావేశంలో చురుకుగా పాల్గొని సందేహాలను నివృత్తి చేసుకున్నారు.

## నీలం గేదెలకు ఉత్తమ కవి అవార్డు

### - ప్రపంచ తెలుగు కవుల మహాసభలో సత్కారం



**పోలాకి, ఫిబ్రవరి 21(వార్త):** రాళ్లపాడు గ్రామానికి చెందిన కవి నీలం గేదెలకు విజయవాడ తుమ్మలపల్లి కళాక్షేత్రంలో ఉత్తమ కవి అవార్డు మరియు ప్రశంసాపత్రం అందజేశారు. మాతృభాష దినోత్సవం సందర్భంగా శనివారం నిర్వహించిన ప్రపంచ తెలుగు కవుల మహాసభలో కవితా పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఆంధ్రప్రదేశ్ తెలుగు, సంస్కృత అకాడమీ ఛైర్మన్ ఆర్.డి. విల్సన్, ఏపీ నాటక అకాడమీ ఛైర్మన్ గుమ్మడి గోపాలకృష్ణ పాల్గొని విజేతలకు బహుమతులు అందజేశారు. నీలం గేదెలు తన కవిత్వంతో ప్రేక్షకులను ఆకట్టుకుని ఉత్తమ కవి అవార్డును అందుకున్నారు. ఈ సందర్భంగా పలువురు సాహితీ వేత్తలు, కవులు ఆయనను అభినందించారు. మాతృభాష పరిరక్షణకు కవులు చేస్తున్న సేవలను కార్యక్రమంలో ప్రశంసించారు.

## ప్రభుత్వ పాఠశాలల్లో స్వచ్ఛ ఆంధ్ర నిర్వహణ



**జలుమూరు, ఫిబ్రవరి 21(వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు శనివారం స్వచ్ఛ ఆంధ్ర--స్వర్ణాంధ్ర కార్యక్రమాలను మండలంలోని ప్రభుత్వ పాఠశాలల్లో నిర్వహిస్తున్నట్లు ఎంఈఓలు బమ్మిడి మాధవరావు, ఎం.వి.ఆర్.ఎస్ ప్రసాద్ రావు తెలిపారు. ఈ సందర్భంగా ఎంఆర్సీ కార్యాలయంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమాన్ని ప్రారంభించినట్లు వారు వివరించారు. మండలంలోని ప్రతి ప్రభుత్వ పాఠశాలలో పరిశుభ్రత కార్యక్రమాలను విస్తృతంగా చేపట్టాలని సూచించారు. పాఠశాల ప్రాంగణాలు, తరగతి గదులు, పరిసర ప్రాంతాలు పరిశుభ్రంగా ఉంచడం ద్వారా విద్యార్థుల్లో శుభ్రతపై అవగాహన పెంపొందుతుందని తెలిపారు. ఈ కార్యక్రమాల ద్వారా పరిసరాలు పరిశుభ్రంగా మారి స్వర్ణాంధ్ర సాధనకు తోడ్పడుతుందని ఎంఈఓలు పేర్కొన్నారు.

## గుప్పెడుపేట జీడి తోటలో అగ్నిప్రమాదం

### -అగ్నిమాపక సిబ్బంది చాకచక్యంతో మంటల అదుపు

**పోలాకి, ఫిబ్రవరి 21(వార్త):** గుప్పెడుపేట గ్రామంలో శుక్రవారం రాత్రి జీడి తోటలో అగ్నిప్రమాదం చోటుచేసుకుంది. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం సమీపంలో ఉన్న జీడి తోటలో అకస్మాత్తుగా మంటలు చెలరేగడంతో గ్రామస్తులు అప్రమత్తమయ్యారు. మంటలు వేగంగా వ్యాపించడంతో స్థానికులు వెంటనే కోటబొమ్మాళి అగ్నిమాపక సిబ్బందికి సమాచారం అందించారు. సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది హుటాహుటిన ఘటనాస్థలికి చేరుకుని మంటలను అదుపులోకి తీసుకువచ్చారు. వారి చాకచక్యంతో సమీప ప్రాంతాలకు మంటలు వ్యాపించకుండా నిలువరించగలిగారు. అగ్నిప్రమాదానికి గల ఖచ్చితమైన కారణం తెలియరాలేదని స్థానికులు తెలిపారు. నష్టంపై పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది. ఈ ఘటనపై అధికారులు దర్యాప్తు చేపట్టినట్లు సమాచారం.



# పైప్‌లైన్ తవ్వేసి వదిలేశారు.. పట్టించుకోరా!

### -ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈని ప్రశ్నించిన ఎంపీపీ
### -కోరం లేక ఆలస్యంగా సర్వసభ్య సమావేశం
### -తీరిగ్గా వచ్చిన ఎంపీడీవో..సభ్యుల అసహనం




**సంతబొమ్మాళి, ఫిబ్రవరి 21(వార్త):** ఉమిలాడ పంచాయతీలో రోడ్డు నిర్మాణానికి పైప్ లైన్లు తవ్వేసి వదిలేయడంతో తాగునీటి కోసం ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని, కానీ అధికారులు ఎందుకు పట్టించుకోవడం లేదంటూ ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ ఆర్.మహేష్‌ను..ఎంపీపీ మేరుగ రాజేశ్వరి ప్రశ్నించారు. స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో ఎంపీపీ మేరుగ రాజేశ్వరి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం శనివారం నిర్వహించారు. పైప్ లైన్లు తవ్వేసి ఎందుకు వదిలేశారని స్థానికులు ప్రశ్నిస్తే కొత్త స్కీం వస్తుందని కూటమి నాయకులు చెప్తున్నారని.. అయితే అంతవరకు తాగునీరు అవసరం లేదా అంటూ రాజేశ్వరి ప్రశ్నించారు. పరిశీలించి సమస్యను పరిష్కరిస్తానని ఏఈ మహేష్ సమాధానం ఇచ్చారు. గెద్దలపాడులో అంగన్‌వాడీ కార్యకర్త పోస్ట్ ఖాళీ ఆరు నెలలు కావస్తున్నా.. నోటిఫికేషన్ ఇవ్వలేదని లక్కీవలస సర్పంచ్ శ్రీరంగం వీరస్వామి సభ దృష్టికి తెచ్చారు. దీనిపై ఐసీడీఎస్ పీవో హైమావతి మాట్లాడుతూ ఉన్నతాధికారులకు సమాచారం ఇచ్చామని, జిల్లా మొత్తం ఒకేసారి నోటిఫికేషన్ ఇస్తారని సమాధానం ఇచ్చారు. లక్ష్మీపురంలో హుదూద్ ఇళ్లు అర్హులైన 95 మందికి ఇంతవరకు ఎందుకు ఇవ్వలేదని ఎంపీపీ రాజేశ్వరి హౌసింగ్ అధికారిని ప్రశ్నించారు. ఈ విషయాన్ని హౌసింగ్ డీఈ దృష్టికి తీసుకుని వెళ్తామని మండల హౌసింగ్ అధికారి తెలియజేశారు. 2024-25 సంవత్సరానికి సంబంధించి 32 కోట్లు రూపాయల పనులను ఉపాధి హామీ పథకం కింద చేపట్టామని, దీనిపై గ్రామాల్లో సోషల్ ఆడిట్ జరుగుతున్నదని ఉపాధి హామీ ఏపీవో పి.నరసింహమూర్తి సభ దృష్టికి తెచ్చారు. రాగులకు కేంద్ర ప్రభుత్వం రూ.4900ల మద్దతు ధర ప్రకటించిందని ఏఈఓ శ్రీధర్ తెలిపారు. రైతు సేవా కేంద్రాల్లో ప్రతి రైతు 11 అంకెలతో కూడిన విశిష్ట నెంబరు నమోదు చేసుకోవాలని కోరారు. మార్చి16వ తేదీ నుంచి పదో తరగతి పబ్లిక్ పరీక్షలు ప్రారంభమవుతాయని, 12 పాఠశాలలకు చెందిన 632 విద్యార్థులు పరీక్షలు రాయనున్నారని ఎంఈఓ జె.చిన్నవాడు తెలిపారు. కార్యక్రమంలో వైస్ ఎంపీపీ పోశీదల తులసమ్మ, ఎంపీడీవో జయంత్ ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.



### కోరం లేక..రెండు గంటలు ఆలస్యంగా..

కోరం లేక సర్వసభ్య సమావేశం రెండు గంటలు ఆలస్యంగా ప్రారంభమైంది. మరోపక్క 10 గంటలకు ప్రారంభం కావలసిన సర్వసభ్య సమావేశానికి బాధ్యతగా వ్యవహరించాల్సిన ఎంపీడీవో పి. జయంత్ ప్రసాద్ 11.30 నిమిషాలకు కార్యాలయానికి వచ్చారు. దీంతో ఎంపీడీవో తీరుపై కొందరు సభ్యులు అసహనం వ్యక్తం చేశారు.

## ఎమ్మెల్యేని విమర్శించే హక్కు వైసీపీ నేతలకు లేదు

### -అసెంబ్లీలో నిజాలు వెల్లడించిన బగ్గు రమణమూర్తి -నరసన్నపేట టీడీపీ నేతలు



**నరసన్నపేట, ఫిబ్రవరి 21(వార్త):** అసెంబ్లీలో ప్రజా సమస్యలపై నిజాలు వెల్లడించిన ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తిపై వైసీపీ నాయకులు విమర్శలు చేయడం తగదని నరసన్నపేట టీడీపీ నేతలు పేర్కొన్నారు. శనివారం నరసన్నపేట టిడిపి కార్యాలయంలో ఏర్పాటు చేసిన సమావేశంలో వారు మాట్లాడారు. రాష్ట్ర కాలింగ కార్పొరేషన్ చైర్మన్ రోనంకి కష్టమనాయుడు, నాయకులు గొద్దు చిట్టిబాబు, జామి వెంకటరావు మాట్లాడుతూ ప్రజా ప్రయోజనాల కోసం అసెంబ్లీలో గళమెత్తిన ఎమ్మెల్యేపై విమర్శలు చేయడం సరైన పద్ధతి కాదన్నారు. రమణమూర్తి హయాంలో పాఠశాలలు సహా పలు అభివృద్ధి కార్యక్రమాలు వేగంగా జరిగాయని పేర్కొన్నారు. 'నాడు--నేడు' పేరిట వైసీపీ నాయకులు ప్రజా నిధులను దుర్వినియోగం చేశారని ఆరోపించారు. ప్రజల అభివృద్ధి కోసం కృషి చేస్తున్న నాయకులపై ఆరోపణలు చేయడం రాజకీయంగా సమంజసం కాదని వారు విమర్శించారు.

## సోంపేటలో రైతుబజార్ ఏర్పాటు చేయాలి



**సోంపేట, ఫిబ్రవరి 21(వార్త):** సోంపేట మండల పరిధిలో వెనుకబడిన తరగతుల సామాజిక వర్గాలకు చెందిన రైతులు వివిధ రకాల కూరగాయల పంటల సాగు చేసుకుని వాటిని విక్రయించుకునే సౌకర్యాలు లేకపోవడం దురదృష్టకరమని జాతీయ బీసీ సంక్షేమ సంఘం ఆవేదన వ్యక్తం చేసింది. ఈ మేరకు సంఘం రాష్ట్ర మహిళా కన్వీనర్ సేపాన గుణవతి ఆధ్వర్యంలో సోంపేట తాసిల్దార్ బి అప్పలస్వామికి వినతి పత్రం అందజేశారు. అలాగే పంచాయతీ కార్యనిర్వహణాధికారికి కూడా వినతిపత్రం అందజేశారు. సోంపేట పట్టణంలో వెంటనే రైతు బజారును ఏర్పాటు చేయాలని డిమాండ్ చేశారు. రైతు బజారు లేకపోవడం రైతులు వారి ఉత్పత్తులను విక్రాయించుకోలేని పరిస్థితుల్లో దళారులకు కారు చౌకగా అమ్ముకోవాల్సి వస్తుందని అన్నారు. దీనివల్ల బిసి వర్గాల రైతులు తీవ్రంగా నష్టపోతున్నారని వాపోయారు. ఈ పరిస్థితుల్లో రైతు బజార్ ఏర్పాటు చేయడం వలన రైతులు తమ పంటలను నేరుగా ప్రజలకు అమ్ముకునే అవకాశం ఉంటుందని తెలిపారు. రైతులు వినియోగదారులు ప్రయోజనాల దృశ్య సోంపేట పట్టణంలో రైతు బజారు ఏర్పాటు చేయాలని కోరారు. కార్యక్రమంలో జిల్లా ఉపాధ్యక్షులు కొత్ర రవికుమార్, మురళి ప్రధాన కార్యదర్శి మల్లా యుగంధర్ జిల్లా సలహాదారు ఎల్ గోవిందరాజులు అమరలోకనాథం నోట్ల కృష్ణమూర్తి పి పోలయ్య డిల్లేశ్వరరావు నిర్మల తదితరులు పాల్గొన్నారు.

## అంగన్‌వాడీలకు రూ.26వేలకు వేతనం పెంచాలి




**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 21(వార్త):** అంగన్‌వాడీలకు కనీస వేతనం రూ.26000లు ఇవ్వాలని అంగన్‌వాడీ యూనియన్ డిమాండ్ చేసింది. ఈ మేరకు ఇచ్ఛాపురం ఐసీడీఎస్ ప్రాజెక్టు ఆఫీసర్ రాజేశ్వరి యూనియన్ అధ్యక్షురాలు బర్ల హైమవతికి వినతిపత్రం అందజేశారు.

ప్రస్తుత బడ్జెట్ సమావేశంలో నిర్ణయం తీసుకోవాలని డిమాండ్ చేశారు. పెండింగ్లఓ ఉన్న 1810 మినీవర్కర్లకు క్వాలిఫికేషన్ రిలక్సేషన్ ఇచ్చి మెయిన్ సెంటర్లుగా మార్చాలని, గ్రాట్యూటీ అమలుకు గైడ్‌లైన్స్ రూపొందించాలని విన్నవించారు. వేతనంతో కూడిన మెడికల్ లీవ్ ఇవ్వాలని అంగ న్వాడీలకు సంక్షేమ పథకాలు అర్బన్, రూరల్ తేడా లేకుండా అందరికీ అమలుచేయాలని కోరారు. హెల్పర్ల ప్రమోషన్లకు నిర్దిష్టమైన గైడ్‌లైన్స్ రూపొందించి అమలుచెయ్యాలని, పెండింగ్‌లో ఉన్న 164 సూపర్‌వైజర్ పోస్టులు వెంటనే భర్తీచేయాలని, మే నెలలో వేసవి సెలవుల జీఓ. వెంటనే ఇవ్వాలని, బియ్యం, ఆయిల్, కందిపప్పు క్వాంటిటీ పెంచాలని, మెనూ చార్జీలు పెంచాలని, ఉచితంగా గ్యాస్ సరఫరాచెయ్యాలని, ప్రీ స్కూల్ బలోపేతం చేయాలని, ప్రీ స్కూల్ పిల్లలకు తల్లికి వందనం పథకాన్ని అమలు చేయాలని, 5 సంవవత్సరాల్లోపు పిల్లలందరూ అంగ న్వాడీ సెంటర్లో ఉండాలని జీవో ఇవ్వాలని కోరారు.

## అంగన్‌వాడీలు సక్రమంగా పని చేయాలి



**మందస, ఫిబ్రవరి 21(వార్త):** అంగన్ వాడీ కార్యకర్తలు సక్రమంగా పనిచేయాలని ఐసీడీఎస్ ప్రాజెక్ట్ అధికారిణి పెద్దింటి అరుణ ఆదేశించారు. మందస పట్టణంలో జరిగిన ప్రాజెక్ట్ స్థాయి సమావేశంలో అరుణ మాట్లాడుతూ అంగన్ వాడీ కార్యకర్తలు బాధ్యతతో, సమయ పాలన పాటిస్తూ పని చేయాలన్నారు. ప్రీస్కూల్ సిలబస్ ప్రకారం జరగాలని, మెనూ ప్రకారం ఫుడ్ పెట్టాలన్నారు. ఈకేవైసీ ఆధార్ పెండింగ్ లేకుండా చూడాలని, టీహెచ్‌ఆర్ డిస్ట్రిబ్యూషన్ శతశాతం జరగాలన్నారు. ముస్తాబు కార్యక్రమం అన్ని సెంటర్లలో అమలు జరగాలని ఆదేశాలన్నారు. కార్యక్రమంలో సూపర్ వైజర్లు, అంగన్ వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

## పాఠశాల అభివృద్ధిపై హర్షం

**సోంపేట, ఫిబ్రవరి 21(వార్త):** గొల్లగండి గ్రామంలో మండల పరిషత్ ప్రాథమికోన్నత స్థానిక మత్స్యకారు సహకార సంఘ అధ్యక్షులు గండుపల్లి చిన్న రాజారావును పాఠశాల ప్రధానోపాధ్యాయుడు గోపి ఎంఈఓ జోరాడు శనివారం జరిగిన ఒక కార్యక్రమంలో అభినందించారు. పాఠశాలలో ఫ్లోరింగ్ శిథిలావస్థకు చేరి విద్యార్థులు కూర్చోవడానికి కూడా వీళ్లేని పరిస్థితుల్లో ప్రజా ప్రతినిధులతో మాట్లాడి నిధులు మంజూరు చేయించి వేగంగా పనులు చేపట్టి సౌకర్యాలు కల్పించడం అభినందనీయమని అన్నారు.



## 'సూర్యోదయ' విద్యార్థి సాయికేతన్ ప్రతిభ

### మ్యాథ్స్ ఒలింపియాడ్‌లో 8వ ర్యాంకు

**మందస, ఫిబ్రవరి 21(వార్త):** సూర్యోదయ స్కూల్ విద్యార్థుల ప్రతిభ కొనసాగుతోంది. పలు విభాగాలలో సూర్యోదయ స్కూల్ విద్యార్థులు మంచి గుర్తింపు తెచ్చుకుంటున్నారు. తాజాగా స్టేట్ వైజ్ మ్యాథ్స్ ఒలింపియాడ్ లో నెయ్యిల సాయికేతన్ 8వ ర్యాంకు సాధించి సూర్యోదయ స్కూల్ కి గొప్ప గుర్తింపు తీసుకువచ్చాడు. సూర్యోదయ స్కూల్ 2024-25 సంవత్సరానికి చెందిన 1వ బ్యాచ్ విద్యార్థి నెయ్యిల సాయికేతన్(తండ్రి నెయ్యిల కృష్ణారావు) ఆల్ ఏపీఆర్జేసీ కాలేజీలో స్టేట్-వైజ్ మ్యాథ్స్ ఒలింపియాడ్ లో 8వ ర్యాంకు సాధించాడు. 2024-25లో పదవ తరగతిలో 586/600 అత్యధిక మార్కులు సాధించి, ఏపీఆర్జేసీ స్థానం కైవసం చేసుకున్నాడు. సూర్యోదయ స్కూల్ విద్యార్థులు విద్యారంగంలో సాధిస్తున్న విజయాలకు ఇది ఒక గొప్ప ఉదాహరణని, ఈ ఘన విజయాన్ని సాధించిన మా విద్యార్థులకు డైరెక్టర్ మోణంగి నాగేశ్వరరావు, ప్రిన్సిపాల్ పిల్లి లోకేశ్వరరావు అభినందనలు తెలిపారు.





జాతీయ వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

# నేడు మాజీ మంత్రి సీదిరి జన్మదిన వేడుకలు



**మందస, ఫిబ్రవరి 21(వార్త):** మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజు జన్మదిన వేడుకలను ఈ నెల 22న మందసలో నిర్వహిస్తున్నట్టు వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు చెప్పారు. ఫిబ్రవరి 22న మాజీ మంత్రి, పలాస నియోజకవర్గం ప్రగతి ప్రదాత డాక్టర్ సీదిరి అప్పలరాజు జన్మదిన వేడుకలు మందసలో ఘనంగా నిర్వహించేందుకు ఏర్పాట్లు సిద్ధం చేసినట్టు, ఈ వేడుకలు మండల పార్టీ, మందస పట్టణ పార్టీ ఆధ్వర్యంలో జరుగుతాయన్నారు. ఉదయం 9గంటలకు మందస పట్టణంలోని శ్రీవాసుదేవ పెరుమాళ్ ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం ఆలయం ఆవరణలో కేక్ కటింగ్ చేస్తామన్నారు. మందస మండలంలో పంచాయతీ సర్పంచ్ లు, ఎమ్పీటీసీలు, పంచాయతీ పార్టీ అధ్యక్షులు, అనుబంధ విభాగాల అధ్యక్షులు, బూత్ కమిటీ కన్వీనర్ లు, పార్టీ కార్యకర్తలు, జిల్లా, నియోజకవర్గంలో వివిధ పదవులలో ఉన్న మండల నాయకులుగా హాజరై జయప్రదం చేయాలని వారు కోరారు.

# పర్యావరణాన్ని పరిరక్షించాలి

## - ప్లాస్టిక్ నిర్మూలనపై ఎమ్మెల్యే రమణమూర్తి పిలుపు

## -గొల్లలవలసలో స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర నిర్వహణ

**పోలాకి, ఫిబ్రవరి 21 (వార్త):** స్వర్ణాంధ్ర-స్వచ్ఛాంధ్ర కార్యక్రమంలో భాగంగా గొల్లలవలసలో శనివారం విస్తృత శుభ్రత కార్యక్రమం నిర్వహించారు. నరసన్నపేట ఎమ్మెల్యే బగ్గు రమణమూర్తి, నియోజకవర్గ సమన్వయకర్త బగ్గు అర్చన ముఖ్య అతిథులుగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ స్వర్ణాంధ్ర సాధనలో స్వచ్ఛతకు అత్యంత ప్రాధాన్యం ఉందన్నారు. గ్రామాలు పరిశుభ్రంగా ఉంటేనే ప్రజల ఆరోగ్యం కాపాడుతుందని, పర్యావరణ సమతుల్యత కొనసాగుతుందని పేర్కొన్నారు. ప్లాస్టిక్ వినియోగం పెరగడంతో భూమి, నీరు, గాలి కాలుష్యం అధికమవుతోందని ఆందోళన వ్యక్తం చేశారు.

ప్రతి ఇంటి వద్ద ప్లాస్టిక్ వాడకాన్ని తగ్గించి, పర్యా వరణహిత సంచులు, వస్తువులను వినియోగించాలని గ్రామస్తులకు సూచిం చారు. అనంతరం ఎమ్మెల్యే స్వయంగా చీపురు పట్టుకుని గ్రామ రహదారులు, ప్రజా ప్రదేశాల్లో చెత్తను తొలగిస్తూ ప్రజలతో కలిసి శుభ్రతా కార్యక్రమంలో పాల్గొన్నారు. ప్రజాప్రతినిధులు మాత్రమే కాకుండా ప్రతి పౌరుడు బాధ్యతగా ముందుకు రావాలని పిలుపునిచ్చారు. గ్రామంలో తడి-పొడి చెత్త వర్గీకరణ, చెత్త వేరు చేసే విధానం, ప్లాస్టిక్ నిర్మూలనపై అవగాహన కల్పించారు. స్వచ్ఛత ఒక్కరోజు కార్యక్రమంగా కాకుండా నిత్యచర్యగా మారాలని స్పష్టం చేశారు. ప్రజల భాగస్వామ్యం లేకుండా స్వచ్ఛాంధ్ర లక్ష్యం సాధ్యం కాదని తెలిపారు.



అనంతరం గ్రామస్తులతో కలిసి స్వచ్ఛత ప్రతిజ్ఞ చేశారు. ఈ కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, అభిమానులు, ఇతర ప్రజాప్రతినిధులు, అధికారులు, యువత, మహిళలు, స్వచ్ఛంద సేవకులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## స్వదేశీ మత్స్యకారునికి ఆర్థిక సాయం



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 21 (వార్త):** ఈదుపురం గ్రామానికి చెందిన శరత్ బెహరా వృత్తిరీత్యా మత్స్యకారుడు. తంపర ప్రాంతం నుండి తిరిగి వస్తున్న సమయంలో ప్రమాదవశాత్తు పడిపోవడంతో పళ్ళ పై ఎముకలు విరిగిపోయి తీవ్రంగా గాయపడ్డారు. ఆయనను బరంపురం మెడికల్ కాలేజ్ లో చికిత్స కోసం జాయిన్ చేశారు. అతని వైద్య ఖర్చుల నిమిత్తం పది వేల రూపాయలు ఆర్థిక సహాయం హంగీర్ బెహరా రఘు బెహరా లు అందించారు.

## 23న బహడపల్లిలో జిల్లాస్థాయి డ్యాన్స్ బేబీ డ్యాన్స్ పోటీలు

**మందస, ఫిబ్రవరి 21(వార్త):** బహడపల్లిలో ఈ నెల 23న జిల్లాస్థాయి డాన్స్ బేబీ డాన్స్ పోటీలను నిర్వహిస్తున్నట్టు బహడపల్లి గ్రామ కమిటీ, ప్రజలు చెప్పారు. శ్రీమంకినమ్మ గుడి ప్రతిష్ఠ సందర్భంగా మందస మండలంలోని బహడపల్లి గ్రామంలో జిల్లాస్థాయి డాన్స్ బేబీ డాన్స్ పోటీలను ఈనెల 23న సోమవారం రాత్రి 8 గంటలకు నిర్వహించబడుతుందన్నారు. పాల్గొనే ప్రతీ ఒక్కరూ వారి డాన్స్ కు సంబంధించిన పాటల పెన్ డ్రైవ్ వారే తెచ్చుకోవలెనని, పాటకు తగ్గ కాస్ట్యూమ్స్ మేకప్ తప్పనిసరిగా ఉండాలన్నారు. గ్రూపు, డ్యూయెట్, సోలో డాన్సులు నిర్వహించబడతాయని, ఒక పాటలో పాల్గొన్న కళాకారుడు మరొక పాటలో పాల్గొనరాదని, డాన్స్ పోటీలలో పాల్గొన్న వారికి భోజన సదుపాయం ఉంటుందన్నారు. ప్రవేశ రుసుము గ్రూపు డాన్స్ 200రూపాయలు, సోలో డాన్స్ 100రూపాయలు చెల్లించాలన్నారు. పాల్గొనే కళాకారులు సాయంత్రం ఐదు గంటలకు గుడి ప్రాంగణానికి హాజరు కావలెనని, తుది నిర్ణయం న్యాయ నిర్ణీతలదేనని, ఈ నెల 23 సాయంత్రం 6గంటల్లోపు రిజిస్ట్రేషన్ చేసుకోవాలని సూచించారు. గ్రూప్ డాన్స్ కు ప్రథమ బహుమతి రూ.10వేలు, షీల్డ్, ద్వితీయ బహుమతి రూ.5వేలు, షీల్డ్, తృతీయ బహుమతి రూ.3 వేలు, షీల్డ్ ఇవ్వబడతాయని, బహుమతులను సాలిన జానకిరావు అందజేస్తారన్నారు. డ్యూయెట్ సాంగ్స్ ప్రథమ బహుమతి రూ.4వేలు, షీల్డ్, ద్వితీయ బహుమతి రూ.2వేలు, షీల్డ్, తృతీయ బహుమతి రూ.1000లు, షీల్డ్ అందివ్వడం జరుగుతుందని, వీటిని సాలిన ఉమాపతి (గ్రామ అధ్యక్షుడు) అందిస్తారన్నారు. సోలో సాంగ్స్ కు ప్రథమ బహుమతి రూ.3వేలు, షీల్డ్, ద్వితీయ బహుమతి రూ.2వేలు, షీల్డ్, తృతీయ బహుమతి రూ.1000లు అందజేస్తామని, వీటిని పాలిన మహాలక్ష్మి బహూకరించారన్నారు. పాల్గొనే కళాకారులు 9381462392, 9502013680, 8106020596, 7892274553, 7702358572 అనే ఫోన్ నంబర్లకు సంప్రదించాలని కోరారు.


## సజావుగా సర్వసభ్య సమావేశం




**జి.సిగడాం, ఫిబ్రవరి, 21(వార్త):** సమస్యల పరిష్కారించడానికే సర్వ సభ్య సమావేశమని ఎంపీపీ ఎంపీడీఓ జి. రామకృష్ణారావు అన్నారు. శనివారం మండల ప్రజాపతిషత్ కార్యాలయంలో ఎంపీపీ మీసాల సత్యవతి అధ్యక్షతన సర్వసభ్య సమావేశం నిర్వహించారు. సమావేశానికి విచ్చేసిన అధికారులు వారు తీసుకొని వచ్చిన నివేదికలను సభ్యులకు చదివి వినిపించారు. రైతుకు సకాలంలో యురియా అందేలా చూడాలని సభ దృష్టికి తీసుకొనివచ్చారు. నర్సింపురం అంగన్వాడీ మరియు ఉపాది హామి పనులు, బిల్లులు విషయాలను సభ్యులు సభ దృష్టికి తీసుకొనివచ్చారు. వేసవి సీజన్ దృష్టిలో పెట్టుకొని వైద్య అధికారులు ప్రజల ఆరోగ్యంపై పలు సూచనలు తెలియజేశారు. ప్రభుత్వ పాఠశాల అబివృద్ధి నైపుణ్యం కోసం చర్చించారు. ఈ కార్యక్రమంలో జెడ్పీటీసీ కాయల రమణ, వైస్ ఎంపీపీ మీసాల స్వాధ్వీమణి,తోలేటి వెంకట్రావు, ఎంఈఓ అరసాడ రవి, ముళ్లు శ్రీనివాసరావు, ఎఓ బాజ్జి, ఎపీఓ చోళ్ల సత్యనారాయణ, ఏపీఎం రెడ్డి రామకృష్ణ, వైద్య అధికారులు యశ్వంత్, అనూష,ప్రతిష్ట శర్మ, సుమబిందు, ఎఈఈ రాజశేఖర్ సర్పంచ్లు, ఎంపీటీసీలు పాల్గొన్నారు.



# స్వచ్ఛ ఆంధ్రప్రదేశ్‌గా తీర్చిదిద్దుదాం : మామిడి



**మెళియాపుట్టి, ఫిబ్రవరి 21(వార్త):** రాష్ట్రాన్ని స్వచ్ఛ ఆంధ్ర ప్రదేశ్ గా దిద్దుదామని ఆదర్శంగా ప్రతి ఒక్కరు కృషి చేయాలని ఎమ్మెల్యే మామిడి గోవిందరావు అన్నారు. ప్రభుత్వం ఎంతో ప్రతిష్టాత్మకంగా నిర్వహిస్తు ప్లాస్టిక్ నిర్మూలన కార్యక్రమంలో భాగంగా శనివారం నాడు స్వచ్ఛ రథాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, ఐటీశాఖ మంత్రి నారా లోకేష్ లు రాష్ట్రన్ని రంగాల్లో ముందుండేలా కృషి చేస్తున్నారన్నారు. మండలంలో ఉన్న అన్ని గ్రామాలలో ఈ రథం తిరిగి చెత్త సేకరణ చేస్తుందని తెలియజేశారు. అనేకంశాలపై మాట్లాడారు. అనంతరం మండల కేంద్రంలో గల ప్రాథమిక పాఠశాల ఆవరణలో మొక్కలు నాటే కార్యక్రమంలో సైతం పాల్గొన్నారు. ఈ కార్యక్రమంలో ఆయనతోపాటు ప్రజాప్రతినిధులు, అధికారులు, ఉద్యోగులు, సిబ్బంది, ఉపాధ్యాయులు, మహిళలు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.

# సైబర్ నేరాలపై విద్యార్థులకు అవగాహన




**నరసన్నపేట, ఫిబ్రవరి 21(వార్త):** సమాజంలో సైబర్ నేరాలు రోజురోజుకూ పెరుగుతున్న నేపథ్యంలో యువత అప్రమత్తంగా ఉండాలని ఎస్సై గణేష్ సూచించారు. శనివారం నరసన్నపేటలోని ఒక ప్రైవేట్ డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు సైబర్ అవగాహన సదస్సు నిర్వహించారు.

ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ నేడు ప్రతి ఒక్కరి చేతిలో స్మార్ట్ ఫోన్ ఉండటం వల్ల మోసగాళ్లు కొత్త కొత్త పద్ధతులతో మోసాలకు పాల్పడుతున్నారని తెలిపారు. గుర్తు తెలియని వ్యక్తుల నుండి వచ్చిన మెసేజ్‌లు, లింకులు, కాల్స్‌కు స్పందించవద్దని సూచించారు. వ్యక్తిగత వివరాలు, ఓటీపీలు, బ్యాంకు సమాచారం ఎవరికీ ఇవ్వకూడదని హెచ్చరించారు. ఇప్పటికే సైబర్ మోసాల బారినపడి అనేక మంది లక్షల రూపాయలు కోల్పోయారని గుర్తు చేశారు. అనుమానాస్పద ఘటనలు ఎదురైతే వెంటనే పోలీసులను సంప్రదించాలని, సైబర్ క్రైమ్ హెల్ప్‌లైన్‌కు ఫిర్యాదు చేయాలని సూచించారు. విద్యార్థులు సైబర్ భద్రతపై అవగాహన పెంపొందించుకుని ఇతరులకు కూడా తెలియజేయాలని కోరారు.

# జీరో వేస్ట్ గవర్నెన్స్‌పై అవగాహన ఉండాలి



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 21(వార్త):** ఇచ్ఛాపురం పురపాలక సంఘం పరిధిలో "స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర" కార్యక్రమములో భాగంగా " జీరో వేస్ట్ గవర్నెన్స్" థీమ్ తో వివిధ అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ఇందులో భాగంగా పురపాలక సంఘంలోని అన్ని గార్బేజ్ వల్నరబుల్ పాయింట్ లను ఎత్తివేశారు. అనంతరం రవీంద్ర భారతి స్కూల్ లో మున్సిపల్ కమిషనర్ రమేష్ ఆధ్వర్యంలో విద్యార్థులకు పారిశుద్ధ్యం మరియు పరిశుభ్రత పై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఇందులో భాగంగా మున్సిపల్ కమిషనర్ మున్సిపల్ సాలిడ్ వేస్ట్ మేనేజ్మెంట్ రూల్స్ 2026 అనుసరించి చెత్తను నాలుగు రకాలుగా విభజించారని తడి చెత్తను పచ్చ రంగు డబ్బాలో, నీలం రంగు డబ్బాలో, హానికరమైన చెత్తను ఎరుపు రంగు డబ్బాలో, ఎలక్ట్రానిక్ వేస్ట్ ను నలుపు రంగు డబ్బాలో వేసి మున్సిపల్ చెత్త సేకరణ వాహనాలకు అందించాలని కోరారు. ముస్తాబు కార్యక్రమం ప్రతి ఒక్కరు అలవర్చుకోవాలని విద్యార్థులకు సూచించారు. అనంతరం విద్యార్థులచే స్వచ్ఛ ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం స్వర్ణ ఆంధ్ర స్వచ్ఛ ఆంధ్ర ఆకృతిలో విద్యార్థులను అమర్చి, స్వచ్ఛ ఆంధ్రపై అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో ప్రధానోపాధ్యాయులు,జి కె నాయుడు ఉపాధ్యాయ సిబ్బంది, సచివాలయ సిబ్బంది పాల్గొన్నారు.డిగ్రీ కాలేజీ లో ప్రిన్సిపాల్ శ్రీనివాసరావు ప్రాజెక్టు ఆఫీసర్ పాండవ సంతోష్ కుమార్ ఆధ్వర్యంలో స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమం నిర్వహించారు.

## బాడాం ఉన్నత పాఠశాలలో క్లస్టర్ స్థాయి సమావేశం




**నరసన్నపేట, ఫిబ్రవరి 21(వార్త):** నరసన్నపేట మండలంలోని ఉపాధ్యాయుల క్లస్టర్ స్థాయి సమావేశాలు శనివారం మధ్యాహ్నం ప్రారంభమయ్యాయి. బాడాం ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఈ సమావేశాన్ని మండల విద్యాశాఖ అధికారులు ఉప్పాడ శాంతారావు, పేడాడ దాలినాయుడు సందర్శించి పరిశీలించారు. ఈ సందర్భంగా ఎంఈఓలు మాట్లాడుతూ ఉపాధ్యాయులు క్లస్టర్ సమావేశాలలో తప్పనిసరిగా పాల్గొనాలని సూచించారు. విద్యా ప్రమాణాల మెరుగుదల, బోధనలో నూతన పద్ధతుల అమలు, విద్యార్థుల అభ్యాస ఫలితాలపై చర్చించేందుకు ఈ సమావేశాలు ఉపయోగపడతాయని తెలిపారు. ఆన్‌లైన్ పాఠాల ద్వారా రిసోర్స్ ఉపాధ్యాయులు మార్గదర్శకత్వం అందిస్తున్నారని, ఉపాధ్యాయులు సాంకేతికతను సమర్థవంతంగా వినియోగించుకోవాలని సూచించారు. సమావేశంలో పలువురు ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

## ఈదుపురం లో అగ్ని ప్రమాదం



**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 21 (వార్త):** ఈదుపురంలో రేకిళ్లు అగ్ని ప్రమాదానికి గురై పూర్తిగా దగ్ధమైంది. వివరాల్లోకి వెళితే.. ఉప్పాడ భారతమ్మ ఎప్పటిలాగే ఉదయం పనులు పూజ చేసుకొని ఇంట్లో దేవునికి దీపం పెట్టి పొలాలకు వెళ్లారు. అక్కడికి కాసేపటికి తను ఉంటున్న ఇల్లు అగ్ని ప్రమాదానికి గురైంది. దీంతో ఆమె అక్కడికి చేరుకొని లబోదిబో మంటూ రోధించింది. ఇంట్లో తన కుమారుడికి బయట దేశం పనులకు వెళ్లేందుకు అప్పుగా లక్ష రూపాయలు తీసుకొచ్చానని దీంతో పాటు తులం బంగారం కూడా ఉందని ఆమెరోదించింది. ఈ విషయం గమనించిన స్థానికులు అగ్నిమాపక సిబ్బందిని సమాచారం ఇచ్చారు. అగ్నిమాపక సిబ్బంది వెంటనే చెరుకుని మంటలను అదుపులోకి తీసుకొచ్చారు. ఇదే కాక పక్కనే ఉన్న రెండు ఇళ్లకు కూడా ప్రమాదం వాటిల్లే అవకాశాలు ఉన్నాయని స్థానికులు చెబుతున్నారు. బాధిత కుటుంబానికి ప్రభుత్వం ఆదుకోవాలి ఆదుకోవాలని కోరుతున్నారు.

## స్వర్ణాంధ్రతో గ్రామాల్లో పరిశుభ్రత సాధ్యం



**నరసన్నపేట, ఫిబ్రవరి 21(వార్త):** ప్రభుత్వ ఆదేశాల మేరకు ప్రతి మూడవ శనివారం నిర్వహిస్తున్న స్వర్ణాంధ్ర--స్వచ్ఛ ఆంధ్ర కార్యక్రమంలో భాగంగా నరసన్నపేట పీఎంసీ జడ్పీ పాఠశాలలో విద్యార్థులకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంఈఓ పేడాడ దాలినాయుడు మాట్లాడుతూ గ్రామాల్లో పరిశుభ్రత సాధనకు ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని పిలుపునిచ్చారు. ఇంటి పరిశుభ్రతపై ప్రత్యేక దృష్టి సారించాలని, చెత్తను తడి--పొడి విధానంలో వేరు చేసి నిర్వహించాలని సూచించారు. హెచ్ఎం పైడి వెంకటరావు, ఉపాధ్యాయులు మరియు విద్యార్థులు కార్యక్రమంలో పాల్గొన్నారు. స్వచ్ఛతను నిత్యచర్యగా మార్చుకుంటేనే స్వర్ణాంధ్ర లక్ష్యం సాధ్యమవుతుందని ఎంఈఓ పేర్కొన్నారు.

## 23నుంచి బహడపల్లిలో మంకినమ్మతల్లి ఆలయ ప్రారంభోత్సవం

**మందస, ఫిబ్రవరి 21(వార్త):** మందస మండలంలోని బహడపల్లి గ్రామంలో ఈ నెల 23నుంచి మూడు రోజుల పాటు శ్రీ మంకినమ్మ తల్లి ఆలయ ప్రారంభోత్సవం నిర్వహించనున్నట్టు బహడపల్లి గ్రామకమిటీ, ప్రజలు తెలిపారు. 23న సోమవారం ఉదయం 9గంటల నుండి చండేశ్వరితల్లికి చల్లదనం. ఉదయం 10గంటలకు విఘ్నేశ్వర పూజ పుణ్యాహవచనం, రక్షా సూత్ర పూజ, ధారణ, పరిషత్ ప్రాయశ్చిత్తం, పంచ గవ్య ప్రాసన, అంకురారోపణ, ధ్వజారోహణ, స్వస్తి, ఉదయం 11గంటలకు విగ్రహాలు ఊరేగింపు, మధ్యాహ్నం 12:30 గంటలకు ఆలయం దగ్గర అన్నసంతర్పణ(అన్నదానం). సాయంత్రం 3గంటలకు సంకల్పం, యాగశాల ప్రవేశం, అఖండ దీపారాధన మండపా ఆవాహన, వాస్తు క్షేత్ర పాలక, యోగిని, నవగ్రహ దేవత, వేద స్వస్తి, మంగళహారతి, సాయంత్రం 4గంటలకు జలాధివాసం(జలాభిషేకం), ప్రతీ ఇంటి నుండి పసుపు నీటితో ఊరేగింపు, రాత్రి 8గంటలకు సాంస్కృతిక కార్యక్రమాలు, జిల్లాస్థాయి డాన్స్ బేబీ డాన్స్ పోటీలు నిర్వహించబడతాయన్నారు. 24న మంగళవారం ఉదయం 9గంటల నుండి ఆవహనములు, మండప పూజలు, హోమం ఉదయం 10 గంటల నుండి క్షీరాధి వాసం(పాలాభిషేకం), ప్రతీ ఇంటి నుండి పాలు తీసుకుని ఊరేగింపు, సాయంత్రం 3 గంటల నుండి మండప పూజలు, హోమం, పంచ శయ్యాదివాసం, వేద స్వస్తి, అష్టదిగ్బంధన మంగళహారతి, సాయంత్రం 4గంటల నుండి ధాన్యాధివాసం(ధాన్యంతో అభిషేకం) ప్రతీ ఇంటి నుండి ధాన్యంతో ఊరేగింపు జరుగుతుందన్నారు. 25న బుధవారం రోహిణి నక్షత్ర మేష లగ్నమందు బహడపల్లి గ్రామంలో శ్రీమంకినమ్మతల్లి ఆలయ ప్రతిష్టా మహోత్సవం గ్రామ పురజనులచే జరిపించబడుటునదని, ఉదయం 9 గంటల నుండి అంగన్యాసం, కలాన్యాసం, గర్తన్యాసం, యంత్ర ప్రతిష్ట, విగ్రహ ప్రతిష్ట, శిఖర ప్రతిష్ట, నేత్రోన్మీలనం గోముఖ దర్శనం, బలి ప్రధానం, సర్వదర్శనం, ఉదయం 10గంటల నుండి బూరెలు ప్రసాదం ప్రతీ ఇంటి నుండి 11 బూరెలతోఊరేగింపు జరుగుతుందని, మధ్యాహ్నం 12 గంటల నుండి అన్నదాన కార్యక్రమం నిర్వహించబడుతుందన్నారు. భక్తులు పాల్గొని, అమ్మవారి తీర్థ, ప్రసాదాలు స్వీకరించాలని వారు కోరారు.



జాతీయ
వార్త
తెలుగు దిన పత్రిక
శ్రీకాకుళం

## సాఫ్ట్‌బాల్ క్రీడాకారులకు కిట్ల పంపిణీ

**శ్రీకాకుళం, ఫిబ్రవరి 21 (వార్త):** సాఫ్ట్ బాల్ క్రీడాకారులకు రెండు లక్షల రూపాయలు విలువైన కిట్లు, క్రీడాదుస్తులను ఆమదాలవలస ఎమ్మెల్యే కూన రవికుమార్ అందజేశారు. ఆమదాలవలస మున్సిపాలిటీ పరిధిలోని జగ్గుశాస్త్రుల పేట వద్ద ఉన్న ఎన్టీఆర్ గ్రీన్ ఫీల్డ్ స్టేడియం వద్ద నిర్వహిస్తున్న సౌత్ జోన్ నేషనల్ సాఫ్ట్‌బాల్ కోచింగ్ క్యాంప్ ఉత్సాహభరితంగా సాగుతోంది. ఎమ్మెల్యే కూన రవికుమార్ శనివారం ఈ కార్యక్రమంలో పాల్గొని క్రీడాకారులను ప్రోత్సహించారు. క్రీడాకారులు వసతి సదుపాయం కోసం తన వంతు సహాయాన్ని ముందుగానే అందజేశారు. సాఫ్ట్‌బాల్ క్రీడలో రాష్ట్రం, జాతీయ స్థాయిల క్రీడాకారులు గుర్తింపు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, కూటమి ముఖ్య నాయకులు, క్రీడా సంఘాల ప్రతినిధులు, యువత, క్రీడా అభిమానులు పాల్గొన్నారు.



# రెడ్డిక సంఘం.. శత వసంతాల వేడుక

* నేడు కొజ్జిరియాలో వందేళ్ల సంబరాలు * వేమన విగ్రహం ప్రతిష్ట, స్థూపం ఆవిష్కరణ * భారత దేశ స్వాతంత్ర్యానికి 25 ఏళ్ల ము ందే సంఘం ఆవిర్భావం * సంఘం ఏర్పాటైన 14 ఏళ్లకు ఒరిస్సా రాష్ట్రం ఏర్పాటు * ఉమ్మడి మద్రాసు ప్రెసిడెన్సీలో గంజాం జిల్లాలో శ్రీకాకుళం విజయనగరం, గజపతి జిల్లాలు * ప్రస్తుతం పూరి, గంజాం, శ్రీకాకుళం జిల్లా రెడ్డిక మహాజన పురోభివృద్ధి సంఘంగా ఉమ్మడి సేవలు

**ఇచ్ఛాపురం, ఫిబ్రవరి 21 (వార్త):** పూరి, గంజాం, శ్రీకాకుళం జిల్లా రెడ్డిక మహాజన పురోభివృద్ధి సంఘం స్థాపించి వందేళ్లు పూర్తయిన సందర్భంగా కొజ్జిరియా జంక్షన్‌లో జాతీయ రహదారి పక్కన గల సంఘ భవనం వద్ద శత వసంతాల సంబరాలు ఆదివారం ఘనంగా నిర్వహించనున్నారు. రెడ్డిక కుల కవి యోగి వేమన రెడ్డి విగ్రహాన్ని, స్థూపాన్ని కూడా నిర్మించారు. ఆదివారం వేమన విగ్రహంతో పాటు స్తూపం కూడా ఆవిష్కరించనున్నారు.

కుల చరిత్రలోకి వెళితే.. భారత దేశానికి స్వాతంత్ర్యం రావడానికి పాతికేళ్ల ముందే రెడ్డిక సంఘం ఆవిర్భవించింది. 1922 లో నిర్ణయం తీసుకుని ఉమ్మడి మద్రాస్ ప్రెసిడెన్సీలో ఒకప్పటి గంజాం జిల్లాలో ఉన్న ఇచ్ఛాపురంతో పాటు శ్రీకాకుళం, విజయనగరం, గజపతి జిల్లాలు పూరి జిల్లాతో పాటు అతి పెద్ద సంఘంగా ఆవిర్భవించింది. 1925లో నంబర్1తో రిజిస్ట్రేషన్ కూడా జరిగింది. ఇప్పటికి 100 ఏళ్ళు పూర్తి అయ్యింది. 1936 ఏప్రిల్ 1న ఒరిస్సా రాష్ట్రం ఏర్పడింది. దీంతో గంజాం జిల్లా లో ఉన్న శ్రీకాకుళం, విజయనగరంలు విశాఖపట్నం జిల్లాలోకి మార్చారు. 1947లో భారత దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన నాటికి శ్రీకాకుళం జిల్లా ఆవిర్భవించింది. అయినప్పటికీ అదే పూరి,గంజాం శ్రీకాకుళం జిల్లాల పేరుతో సంఘం సేవలు అందిస్తుంది.

ఒకప్పుడు రాజకీయంగా ఓవెలుగు వెలిగిన రెడ్డిక కులస్తులు గత ఐదు దశాబ్దాలుగా రాజకీయ పార్టీల నిరాదరణకు గురవుతున్నారు. పార్టీలన్నీ కులస్తులను ఓటు బ్యాంకుగానే చూస్తున్నాయి. జనాభా దామాషా ప్రకారం పదవుల్లో గాని, రాజ్యాధికారంలోగాని రాజకీయ చైతన్యం మసకబారటం, పోరాట పటిమ లేకపోవడంతో వేరే సామాజిక వర్గాలు పదవులు అనుభవిస్తున్నారనే విమర్శలు ఉన్నాయి. 1922లో ఈ ఆలోచనకి బీజం పడింది. లొద్దపుట్టి గ్రామానికి చెందిన అశీ తమ్మయ్య రెడ్డి నాయకత్వంలో పెద్దలందరూ రెడ్డిక కులస్తులు ఎక్కువగా ఉన్న గ్రామాలలో పర్యటించి కుల సంఘ నిర్మాణం కోసం ప్రయత్నిం చారు. గట్టి ప్రయత్నాల అనంతరం అన్ని గ్రామాల పెద్దలు రెడ్డిక కుల సంఘాన్ని ఏర్పాటు చేయాలని నిర్ణయించారు. అధ్యక్షులుగా ఆశి తమ్మయ్యరెడ్డిని జిల్లా రెడ్డిక మహాజన పురోభివృద్ధి ఎన్నుకొని 16 మంది పెద్దలతో గంజాం సంఘాన్ని ఏర్పాటు చేశారు. సంఘాన్ని సంఘాన్ని 1925 మే 25న రిజిస్ట్రేషన్ చేయించారు. సంఘం అధ్యక్షులుగా ఆశీ తమ్మయ్య రెడ్డి, కార్యవర్గ సభ్యులుగా చినపాన రామయ్య రెడ్డి, బుడ్డెపు గంగయ్య రెడ్డి, తుపాకుల రామయ్య రెడ్డి, చాట్ల జగన్నాయకులు రెడ్డి, అశి జగ్గయ్య రెడ్డి, గాలి గురివి రెడ్డి, రెడ్డి రామస్వామి రెడ్డి, పైల లక్ష్మయ్య రెడ్డి, మద్ది రామయ్య రెడ్డి, ఇసురు అప్పలస్వామి రెడ్డి, మద్ది రామయ్య రెడ్డి, సాడి అప్పల స్వామి రెడ్డి, మరిడి బాలాజి రెడ్డి, కొన పురుషోత్తం రెడ్డి, పైల అప్పలస్వామి రెడ్డి ఎన్నికయ్యారు. సంఘం రిజిస్ట్రేషన్ పత్రాలపై సాక్షులుగా మద్ది రామయ్య రెడ్డి,



కీ॥శే॥ శ్రీ ఆశి నీలాద్రి రెడ్డి
(1952-55) M.L.A


కీ॥శే॥ శ్రీ ఉప్పాడ రంగబాబు
(1955-62) M.L.A
(1972-77)


కీ॥శే॥ శ్రీ లండ కారయ్య రెడ్డి
(1967-72) M.L.A


కీ॥శే॥ శ్రీ దక్కత అచ్యుతరామయ్య రెడ్డి
(1994-99) M.L.A



నారద బాలాజి రెడ్డి, ఏదురు లక్ష్మణరావు రెడ్డి సంతకాలు చేశారు. ఇలా రెడ్డిక కులస్తుల పురోభివృద్ధి కోసం ఒక వేదిక ఏర్పాటయ్యింది. 1925 నుంచి 1944 వరకు సంఘం అధ్యక్షులుగా అశి తమ్మయ్యరెడ్డి (లొద్దపుట్టి) వ్యవహరించారు. 1944 నుంచి 1946 వరకు సుగ్గు వెంకురెడ్డి (ఒమరవిల్లి). 1946 నుంచి 1948 వరకు సాడి అప్పలస్వామి రెడ్డి (నౌవడ) 1948 నుంచి 1972 వరకు లండ కారయ్య రెడ్డి (బొడ్డకాళి), 1972 నుంచి 1774 వరకు పెదిని సింహాద్రి రెడ్డి (కొడిసి), 1974 నుంచి 1995 వరకు 1995 నుంచి కొన్నేళ్లపాటు దక్కత అచ్యుత రామిరెడ్డి (బిర్లంగి తోటూరు) సంఘం అధ్యక్షులుగా పనిచేశారు. రెడ్డిక కులస్తుల ఐక్యత, రాజకీయ చైతన్యం కారణంగా నుంచి 1952 వరకు 1972 వరకు రాజ్యాధికారం లో ఘనమైన స్థానం లభించింది. ఇచ్ఛాపురం నియోజకవర్గం 1953లో లొద్దపుట్టి కి చెందిన జిల్లా ఫారెస్ట్ అధికారి ఆశి నీలాద్రి రెడ్డి తొలి ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. 1955 నుంచి 1960 వరకు ఉప్పాడ రంగబాబు రెడ్డి మొదటి సారి ఎమ్మెల్యే గా గెలుపొందారు. 1967లో లండ కారయ్యరెడ్డి, 1972లో ఉప్పాడ రంగబాబు రెడ్డి రెండోసారి ఎమ్మెల్యేలు ఎన్నికయ్యారు. 1959లో దక్కత పితంబర రెడ్డి ఇచ్ఛాపురం సమితి ప్రథమ అధ్యక్షులుగా ఎన్నికయ్యారు. 1972లో ఎచ్చెర్ల నియోజకవర్గం నుంచి బల్లాడ హరియప్పడు ఏమ్మెల్యేగా ఎన్నికయ్యారు. ఛత్రపురంలో నగిరెడ్ల నారాయణ రెడ్డి ఎమ్మెల్యేగా గెలుపొంది సంచలనం సృష్టించారు. భోగాపురం సమితి అధ్యక్షుడిగా నీలాపు సూర్యనారాయణరెడ్డి పనిచేశారు. టెక్కలి, సంతబొమ్మాళి, కోటబొమ్మాళి, ఎచ్చెర్ల తదితర మండలాల్లో పదవులు స్థానిక సంస్థలు లో దక్కించుకుంటూ వచ్చారు. ఇచ్ఛాపురానికి చెందిన బుద్దాల త్రినాథరెడ్డి జడ్పీ చైర్మన్‌గా పని చేశారు. బెల్లుపడకు చెందిన పోతల కృష్ణమూర్తిరెడ్డి ఇచ్ఛాపురం సర్పంచ్‌గా పని చేశారు. సుగ్గు త్రినాథరెడ్డి పురుషోత్తపురం సర్పంచ్‌గా రెండుసార్లు ఎన్నికయ్యారు. దక్కత నీలమ్మ తొలి ఎంపిపిగా పని చేశారు. బెల్లుపడకు చెందిన పిలక పద్మావతి, పిలక పోలారావులు ఇచ్ఛాపురం మున్సిపల్ చైర్పర్సన్లుగా పనిచేశారు. గుజ్జు గంగాధర రెడ్డి, అశి బాలయ్యరెడ్డిలు వైస్ చైర్మన్లుగా పనిచేశారు. ప్రస్తుతం పిలక రాజలక్ష్మి మున్సినల్ చైర్పర్సన్‌గా రెండు పర్యాయాలు ఉన్నారు. కంచిలి ఎంపీపీగా పైల దేవదాసురెడ్డి ఉన్నారు. ఇచ్ఛాపురం ఎంపీపీగా గతంలో కారంగి మోహనరావు, ప్రస్తుతం ఆయన కుమార్తె బోర పుష్ప ఎంపీపీలుగా ఉన్నారు. 1994లో మరోమారు రెడ్డికల వైపు అవకాశం లభించింది దక్కత అచ్యుతరామయ్యరెడ్డి 1994లో ఎమ్మెల్యేగా ఎన్నికయ్యారు. గత పదేళ్లుగా పోరాటం కొంచెం ఊపందుకోవటంతో పార్టీ పదవులు, కార్పోరేషన్, మున్సిపల్ చైర్మన్ పదవులు ఇచ్చి సంతృప్తి చేస్తున్నారు. రెడ్డిక కులస్తులు జిల్లాలో ఇచ్ఛాపురం, టెక్కలి, ఎచ్చెర్ల అత్యధికంగా ఉన్నారు. ఇచ్ఛాపురం నియోజకవర్గంలో మెజారిటీ ఓటర్లు రెడ్డిక సామాజిక వర్గం ఉన్నారు. రెడ్డిక సామాజిక సంబరాలు ఘనంగా నిర్వహిస్తున్నారు. రెడ్డిక కులస్థులు శత వసంతాల వేడుకలో పెద్ద ఎత్తున పాల్గొనేలా నిర్వాహకులు అన్ని చర్యలు తీసుకుంటున్నారు.

Printed and published and Owner by Chowdari Pramod Kumar , printed at Chowdari Printers, Near RTC complex, Arts colleage wall beside, Hodco colony,srikakulam-532001, AP.
Published at Near RTC complex, Arts colleage wall beside, Hodco colony, Srikakulam-532001. Editor: Chowdari Pramod Kumar, E-mail:jatheeyavaartha@gmail.com.cell. 9963063761, 9160000247, RNI/APTEL:2023/87546